బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- కడప ఎమ్మెల్యే మాటలకే పరిమితం... చేతలు శూన్యం
- కడప నార్త్ జోన్ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బాబూ ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ' కాస్తా బాబూ ష్యూరిటీ– మోసం గ్యారెంటీగా మారిందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. ఆదివారం బళ్లారి రోడ్డులోని ఇంటర్నేషనల్ కళ్యాణ మండపంలో కడప నార్త్‌జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేయర్ సురేష్ బాబు, అంజద్‌బాషాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ ×వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ అని, పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామన్నారు. వారి సమస్యలను తమ సమస్యలుగా భావిస్తామన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రానున్న ప్రభుత్వం 2.0లో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఇప్పటివరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని నమ్మి దారుణంగా మోసపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడితే సహించబోమని హెచ్చరించారు. కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి గెలిచిన మరుసటి రోజే 10 కార్లలో రవీంద్రనగర్‌లో వెళ్లి షాహమీరియా, లా కాలేజ్ బ్రిడ్జిలు ఆరు నెలల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారని, ఏడాది దాటుతున్నా ఒక్క ఇటుక ఏర్పాటు చేయలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన జీవోలను కొత్తగా తేదీలు మార్చి తీసుకొస్తున్నారన్నారు. నగర ప్రజలకు అభివృద్ధి కావాలని, కడప ఎమ్మెల్యే కేవలం మాటలకే పరిమితం అవుతున్నారని, చేతల్లో చేసిందేమీ లేదన్నారు. కడప నగరాన్ని అభివృద్ధి చేస్తానని ప్రత్యేకంగా మేనిఫెస్టో ప్రకటించిన ఆమె ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

- కడప మేయర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు ఎక్కువయ్యాయని, అక్రమ కేసులు పెడుతూ రాక్షసానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. తమ పట్ల అన్యాయంగా అక్రమంగా వ్యవహరించే నాయకులు, అధికారులను గుర్తు పెట్టుకుంటామన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం నార్త్ జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్‌ను ఘనంగా సన్మానించారు.

- ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జోన్ అధ్యక్షులు ఐస్‌క్రీం రవి, నాగేంద్రారెడ్డి, కార్పొరేటర్లు అరీఫుల్లా బాషా, షంషీర్, షఫీ, చెన్నయ్య, మగ్బూల్‌బాషా, డివిజన్ ఇన్‌చార్జులు బసవరాజు, డిష్ జిలాన్, రఫీ, గౌస్‌బాషా, టీపీ వెంకట సుబ్బమ్మ, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, దాసరి శివ, బంగారు నాగయ్య, దేవిరెడ్డి ఆదిత్య, ఉమామహేశ్వరి, రత్నకుమారి, బి. మరియలు, చైతన్య, మల్లీశ్వరి, సుజిత, శివమ్మ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై దాడి ఆటవిక చర్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్: జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నాయకుల దాడి ఆటవికమని వైఎస్సార్‌సీపీ నేత, ఆర్టీసీ మాజీ జోనల్ ఇన్‌చార్జి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబూ ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వెళుతున్న బీసీ మహిళా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కారుపై దాడి చేసి రాళ్లు, కర్రలతో కొడుతూ భయభ్రాంతులకు గురి చేశారని, హారికను బండ బూతు లు తిడుతూ దాడికి యత్నించడం పైశాచికమన్నారు. వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని అడ్డుకునేందుకే ఇలా దాడి చేశారన్నారు. ఇది ఖచ్చితంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. క్రిష్ణా జిల్లా ప్రథమ పౌరురాలైన జెడ్పీ చైర్ పర్సన్‌కే రక్షణ లేకపోతే సామాన్యులకు ఎక్కడుంటుందని ప్రశ్నించా రు. తమ కళ్లముందే దాడి జరుగుతున్నా పోలీసు లు ప్రేక్షక పాత్ర వహించడం రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇలాంటి భౌతిక దాడులతో, పోలీసు కేసులతో, లాఠీ చార్జీలతో వైయస్సార్ సీపీని దెబ్బ తీయలేరన్నారు. ఇలాంటి చర్యలతో వైయస్సార్‌సీపీ మరింత బలో పేతం అవుతుందని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారందరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్ సీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఇ. నిరంజన్ రెడ్డి, వైయస్సార్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై. సుదర్శన్ రాయల్, బి.సి సెల్ జిల్లా కార్యదర్శి బి. సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

బీసీ మహిళపై దాడి చేయడం నీచమైన చర్య

కడప కార్పొరేషన్: ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారనే అక్కసుతోనే జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, బీసీ మహిళ ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు దాడి చేశారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. శివరామ్ అన్నారు. ఇది అత్యంత నీచమైన చర్య అన్నారు. ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి రావడానికి ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిపోయినా ఒక హామీ కూడా నెరవేర్చలేదన్నారు. క్రిష్ణా జిల్లా గుడివాడ సమీపంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని జనాలలోకి వివరించడానికి వెళుతున్న బీసీ మహిళపై దాడి చేయడం అమానుషమన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కి ఈరోజు బీసీలనే అణగదొక్కాలని చూస్తున్నారన్నారు. వాలంటీర్లకు పదివేలు ఇస్తామని చెప్పి చివరికి వాలంటరీ వ్యవస్థనే ఎత్తేసి మోసం చేశారన్నారు. ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ అందిస్తున్న వాహనాలను తీసేసి రేషన్ డ్రైవర్ల కడుపు కొట్టారన్నారు. రైతు భరోసా కింద రైతులకు రూ.20వేలు ఇంకా ఇవ్వలేదన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారని, ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి ఇప్పటికీ మాయమాటలు చెబుతూనే ఉన్నారన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: సమాజంలోని వివిధ వర్గాల మేలును కాంక్షిస్తూ లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ రమేష్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సేవా భావం అలవర్చాలన్నారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జె. రామచంద్ర ప్రకాష్ రావు , పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ కె. చిన్నపరెడ్డి , నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్ . రంగనాథరెడ్డి మాట్లాడారు.

నూతన కార్యవర్గ వివరాలు ....

క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదూరి శివ శంకర్ రెడ్డి, టీఎస్ గౌరీ శంకర్, కార్యదర్శిగా గునిశెట్టి సాయికుమార్, జాయింట్ సెక్రటరీగా రాఘవేంద్ర వర్మ, కోశాధికారిగా సుబఖ్ తాహిన్, సహ కోశాధికారిగా కొండూరు జనార్దన్ రాజు బాధ్యతలు స్వీకరించారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తాం



మాట్లాడుతున్న మాజీ సైనిక ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కెప్టెన్ ఎస్.ఎస్. రాముడు

కడప అర్బన్: కడప అన్నమయ్య ఉమ్మడి జిల్లాలలో ఉన్న మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం కోసం తమ వంతుగా కృషి చేస్తామని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కెప్టెన్ ఎస్. ఎస్.రాముడు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని సి.ఎస్.ఐ హైస్కూల్లో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గౌరవాధ్యక్షుడు కెప్టెన్ ఎస్ ఎస్ రాముడు మాట్లాడారు. ఇళ్ల స్థలాలు భూ సమస్యల గురించి కోర్టు విషయాలు వ్యక్తిగత సమస్యలు ఎవరికైనా ఉంటే వారి సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా అధ్యక్షుడు దాసరి రమణయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు టి అజ్మల్ ఆలీ ఖాన్, కోశాధికారి కిరణ్ కుమార్, సంయుక్త కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, ఆర్ నాగరాజు, ఎం సుబ్రహ్మణ్యం, లీగల్ అడ్వైజర్ దుర్గాప్రసాద్, వీరనారి బషీర్ మున్నీసా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మహా శోభాయాత్ర



శోభయాత్రలో పాల్గొన్న స్వామిజీలు



శోభయాత్రలో పాల్గొన్న హిందువులు

కడప సెవెన్‌రోడ్స్ : కడపజిల్లా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలో సనాతన ధర్మ పురోహిత మహా శోభాయాత్ర నిర్వర్వహించారు. ఉదయం మృత్యుంజయకుంట శివాలయం నుంచి అప్సర సర్కిల్ మీదుగా అన్నమాచార్య సర్కిల్ వద్దకు ఈ శోభాయాత్ర సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది పురోహితులు శోభాయాత్రలో పాల్గొన్నారు. సాయంత్రం ఓ కల్యాణ మండపంలో పురోహిత/స్మార్థ విద్వత్ మహాసభ నిర్వహించారు. జిల్లా హిందూ ఐక్యవేదిక అధ్యక్షులు విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ పురోహితులు శ్రీధర్, రాధామనోహర్‌దాస్, ప్రియానందతోపాటు పెద్ద ఎత్తున హిందువులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును నిర్వహించారు. మహాదుర్గ, మహాలక్ష్మి, మహా సరస్వతి రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని కల్యాణ కర్తలకు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

క్లుప్తంగా

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలను అందజేస్తున్న సట్నా నారాయణస్వామి కుటుంబ సభ్యులు

కడప ఎడ్యుకేషన్: కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు దివంగత సట్నా నారాయణస్వామి వ్యక్తిగత గ్రంథాలయంలోని 400 పుస్తకాలను ఆయన భార్య సట్నా శాంతకుమారి, కుమారుడు ఉమాకాంత్, కోడలు రాజేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులు ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణలకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన గ్రంథాల్లో రామాయణ ఇన్ ఇండియన్ ఆర్ట్ అండ్ ఎపిగ్రఫీ, టెంపుల్ ఆర్కిటెక్చర్ అండ్ స్కల్‌ప్చర్ ఆఫ్ నోలంబాస్, జెనిజం (ఆర్ట్, ఆర్కిటెక్చర్, లిటరేచర్ అండ్ ఫిలాసఫీ), ది ఏన్సియంట్ జియాగ్రఫీ ఆఫ్ ఇండియా, ఎకనమిక్ హిస్టరీ ఆఫ్ అర్లీ ఇండియా, మాన్యువల్ ఆఫ్ కడప, తొలి చారిత్రక ఆంధ్రప్రదేశ్, సాహిత్య దర్శనం, శ్రీనాథుని సాహిత్య ప్రస్థానం, గానకళాబోధిని, మరపురాని మధురమైన గాథ లాంటి పలు విలువైన ఇంగ్లీషు, తెలుగు గ్రంథాలున్నాయన్నారు.

విద్యార్థులకు బాసట

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోంకు శ్రీ సాయికృష్ణ హైస్కూలు కరస్పాండెంట్ సుశీల, ఆదినారాయణరెడ్డి ఆదివారం రూ. 5000 విరాళాన్ని అందజేశారు. చిల్డ్రన్స్ హోం నిర్వాహకులు ఎం.బాలాజీరావు, డీఏ కార్తీక్‌రెడ్డి, కడప హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, ప్రతినిధులు ముకుందరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, నిఖిల్, పవన్, భరత్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగానికి తీరని లోటు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కోటా శ్రీనివాసరావు మృతి తెలుగు సినీ రంగానికి తీరని లోటు అని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కోటా వైవిధ్యభరితమైన పాత్రలతో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. 4 దశాబ్దాల పాటు సినీ రంగానికి ఆయన చేసిన కళాసేవ, పోషించిన పాత్రలు చిరస్మరణీయం అన్నారు. విలన్, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో మధురమైన పాత్రలు తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. 1999లో ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేశారన్నారు.

-విభిన్న పాత్రలకు శిఖర సమాన స్థాయిలో । కోట । లాగా సినీ చరిత్రలో కోటా శ్రీనివాసరావు నిలిచిపోయారని ఆదివారం ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ సంతాపం తెలిపారు.


సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ రుణాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరుతూ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటిలో కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సగిలి రాజేంద్రప్రసాద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్డీఓ కార్యాలయం ముట్టడి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పాత కడప దళితుల భూమి సమస్యలు పరిష్కరించాలని కడప ఆర్డీఓ కార్యాలయం ఎదుట 29 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ఎటువంటి స్పందన లేదని, ఈ విషయమై సోమవారం కడప ఆర్డీఓ కార్యాలయన్ని ముట్టడి చేస్తున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం దీక్ష శిబిరంలో కూర్చున్న బాధితులకు, డిజిహెచ్‌ఎస్ నాయకులకు ముట్టడి కార్యక్రమన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీహెచ్ పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేశు, మడగలం ప్రసాద్, వారధి జోసఫ్, జార్జి, రవి, ఓబులేసు, చిన్న సుబ్బ య్య, వీర సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, ఓబులేసు, పాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కడప అర్బన్: విజిబుల్ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు కడప జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

శాకంబరిగా అంకాలమ్మ తల్లి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలోని వైఎస్సార్ కాలనీలో వెలసిన అంకాలమ్మ తల్లి ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం కూరగాయల అలంకరణతో శాకాంబరిగా దర్శనమిచ్చారు. అంకాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి ఉక్కాయపల్లె, నానాపల్లె, చలమారెడ్డిపల్లెలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శిల్పారామంలో సందడి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక డ్రీమ్ మీడియా సుజాత బృందం శాస్త్రీయ నృత్యాలు, పల్లె జానపదాలు, సినీ నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. వీటితోపాటు పలు ప్రాచుర్యం పొందిన సినీ గీతాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి ఎస్.కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా రుచిత

కడప అగ్రికల్చర్: కడప బిజివేముల వీరారెడ్డి రైతు బజార్‌కు ఎస్టేట్ ఆఫీసర్‌గా రుచితను ఉన్నతాధికారులు నియమించారు. గతంలో ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాయక్‌ను తొలగించి ఆయన స్థానంలో రుచితను ఇన్‌చార్జ్ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కడప అర్బన్ : పానల్ న్యాయవాదులచే 'మధ్యవర్తిత్వంపై' కడప కోర్టు ప్రాంగణం నాల్గవ అదనపు జిల్లా కోర్టు దగ్గర ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, ఇంచార్జ్ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శాంతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యసందర్భంగా ప్యానల్ న్యాయవాదులు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను తెలియజేశారు. మధ్యవర్తిత్వం సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది హసీనా, మధ్యవర్తిత్వ న్యాయవాది శారద, పారా లీగల్ వాలంటరీలు శ్రీనివాసరావు, జిలాని , ప్రజలు పాల్గొన్నారు.

పోషక యాజమాన్యంపై శిక్షణ



మాట్లాడుతున్న తిరుపతి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త భార్గవ రామిరెడ్డి

కడప అగ్రికల్చర్: జిప్సం సోడియంను కాల్షియంతో భర్తీ చేయడం ద్వారా సోడియం నేలలను మెరుగుపరుస్తుందని, ఇవి నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడానికి, పంట ఉత్పాదకతను నిలబెట్టడానికి అవసరం అవుతుందని తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త భార్గవ రామిరెడ్డి పేర్కొన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞానకేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సమగ్ర పోషక యాజమాన్యంపై నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆమ్ల, లవణ, సోడిక్ ప్రభావంతో నేల విషపూరితమై మొలక పోషక శోషణపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ నేలల సవరణకు సున్నం, జిప్సం వాడటం వల్ల నేల పునరుద్ధరణ అవుతుందన్నారు. ఊటుకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల సేద్య విభాగం అధ్యాపకులు స్వామి చైతన్య వ్యవసాయ పర్యావరణ పరిస్థితి, నేల రకాలు, ఎరువుల రకాల గురించి వివరించారు. నేల రకాలను బట్టి ఎరువులను వాడుకోవాలని సూచించారు. ఈ విషయాలను సహకార సంఘ సభ్యులు రైతులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శిల్పకళ, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షన్ ఫెడరేషన్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ల సంఘం గుంటూరు వారి పిలుపుమేరకు 15వ తేదీ అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పెంషనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నారెడ్డి, రామ్మూర్తి నాయుడు తెలిపారు. ఆదివారం కడపలోని పెంషనర్ల సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీ ఉదయం 10:30 గంటలకు కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడానికి నిర్ణయించామని, ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుండి ప్రభుత్వ పెన్షన్ సభ్యులు హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేని శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగ ముని రెడ్డి , ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల ఎల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు నారాయణ, సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీ మస్తాన్, సుభాన్, పార్వతమ్మ, సుబ్బరాయుడులతోపాటు నాయకులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, నిమ్మకాయలు, గంధం , పసుపు, వేపాకు, తోమాలలతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి కోళ్లు, పొట్టేలు, మేకపోతులను బలి ఇచ్చారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

- తాడిగొట్ల గ్రామ ప్రజలు వర్షాలు కురిసి పాడిపంటలు సంవృద్ధిగా పండాలని గ్రామంలోని గంగమ్మ, ఎల్లమ్మ దేవతలకు బోనాలు సమర్పించి విశేష పూజలు నిర్వహించారు.